
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# దూరాన ఉంటూనే

" అక్కతో కలిసి కాఫీ తాగుతున్నది నువ్వేనా?" కొడుకుని అడిగింది పార్వతి కటువుగా...

మాట్లాడలేదు సుజయ్.

" చెప్పురా, నా కళ్ళు నన్ను మోసం చెయ్యవు. రెండు గంటల క్రితం కాఫీ షాప్ లో దానితో ఉన్నది నువ్వే కదూ! పక్కన వాడు కూడా ఉన్నాడు.. ఛీ సిగ్గులేదూ నీకు?" అంది పార్వతి..

ఆమె గొంతు నిండా పట్టరానంత కోపం.. చిరాకు..

" అవును.. వదినే! కావాలనే కలవడానికి వెళ్ళాం" అంటూ వచ్చింది జవాబు కోడలి దగ్గరనించి..

" రీనా? ఏం మాట్లాడుతున్నావు నువ్వు?" అందావిడ మరింత కోపంగా.

" నిజం మాట్లాడుతోందమ్మా!నీకు ఈరోజే తెలిసింది కానీ అక్క ఎప్పుడూ మాతోనే ఉంది" అన్నాడు సుజయ్.

ఏదో వినరాని విషయం విన్నట్టుగా ఉండిపోయింది పార్వతి..

పై అంతస్థులో బాల్కనీలో తన రాకింగ్ చెయిర్ లో కూర్చు ఆకాశం వంక చూస్తూ ఉండి పోయింది. చంద్రోదయం అవుతున్న సమయంలో విడిపోతున్న మబ్బులు, ఆకాశం నిండా పరుచుకున్న తెల్లటి పుచ్చపువ్వులాంటి వెన్నెల.

ఎక్కడా ఒక్క మబ్బుతునక లేకుండా ప్రశాంతంగా ఉంది..

ఆ మేఘాలు విడినట్టు మనసులోని మబ్బులు విడిపోవాలంటే ఏం జరగాలో మరి??.

కళ్ళు మూసుకుని పార్వతి కూర్చున్న కుర్చీ విసురుగా అటూ ఇటూ ఊగుతోంది.

మరో నాలుగైదు నిమిషాలకి వేగం కొద్దిగా తగ్గింది..

నిన్న కాక మొన్న జరిగినట్టుగా ఉంది గతం.

కన్ను మూసినా తెరిచినా మరపునకు రాని జీవితం.

పెద్దలు కుదిర్చిన వివాహం.. రాజేంద్ర, పార్వతిల జంట అపురూపం,అన్యోన్యం వారి దాంపత్యం.

ఇవే బంధువుల్లోనూ, స్నేహితుల్లోనూ తరచూ వారిగురించి వినవచ్చే మాటలు.

పార్వతి మొండితనానికి, ఆమె కోపానికీ రాజేంద్ర సౌమ్యత కి కుదిరిన రాజీ.. భార్యంటే అమితమైన ప్రేమ చూపే అతని వల్ల మరింత పెరిగిన ఆమె మొడితనం.. పెరుగుతున్న సంపదవల్ల చేరిన దర్పం, అహం.. రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న వ్యాపారం,

అందమైన కుటుంబం. మొదట ఆడపిల్ల సుధీర.. తర్వాత సుజయ్, అజయ్ కవలపిల్లలు.

కలలా సాగుతున్న కాలం.. కలిసివచ్చిన అదృష్టంతో పాటు కలిగిన కలిమి.

కలకాలం సాగుతుందనుకున్నది మధ్యలోనే కమ్మని కలలా కరిగిపోయింది..

సుధీరకి పదిహేడో ఏడు నడుస్తూ ఉండగా స్నేహితులతో మహాబలిపురం వెళ్ళిన రాజేంద్ర  సముద్రంలో ఈతకని వెళ్ళి తిరిగిరాలేదు..

తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయిన భర్త ని తలుచుకుని కుమిలిపోయింది పార్వతి.

ఆ సమయంలో పదిహేడేళ్ళ సుధీర తండ్రి వ్యాపారాన్ని తానే నడుపుతానంది. పేరుకు తగ్గ ధైర్యవంతురాలామె, ఎంతో సమ్యమనం, పరిణతి చెందిన ఆలోచనా విధానం.. అచ్చంగా తండ్రిపోలిక..

ఒకరిద్దరు పనివాళ్ళ సహాయంతో ఇల్లు నడుపుకోవడం తప్ప మరేమీ తెలియని పార్వతికి ఉన్న వ్యాపారాన్ని ఎలా పదిలపరుచుకోవాలో తెలియదు, దాంతో తప్పని ఒడిదుడుకులు.

అదును చూసి సమయానికి తమ నిజస్వరూపాలు చూపించే 'నమ్మకస్థులు'. తుఫానులో చిక్కిన చిగురుటాకులా అల్లాడిపోయిందామె.

చూస్తుండగానే ఇల్లు గడవడం కోసం తమ పెద్ద ఇంటిని అద్దెకిచ్చి చిన్న ఫ్లాట్ లోకి మారవలసి వచ్చింది. వర్క్ షాప్ లో టైలర్లు, ప్రతీ నెలా తప్పకుండా ఇచ్చే దుకాణాలకి ఇవ్వవలసిన బట్టలూ, ఎంబ్రాయడరీ డిజైన్లు, రక రకాల ఇతర వస్తువులూ, పనిచేసేవారికి ఇవ్వవలసిన జీతాలు, కట్టవలసిన అద్దెలు, అడ్వాన్సులూ.. వీటిల్లో వేటిమీదా పెద్దగా అవగాహన లేక, తమకున్న ఆస్తులు, అప్పుల లెక్కలు తెలీక అంతా అయోమయం..

చదువుతున్న ఇంటర్మీడియెట్ ని మధ్యలోనే ఆపేసి వ్యాపారాన్ని చూసుకుంటానన్న సుధీరకి అంతకన్నా ఎక్కువ తెలిసే అవకాశమే లేదు..

పసితనం వదలని ప్రాయం, స్నేహితులతో ఆడుతూ పాడుతూ చదువుకునే సమయం.. ఇవన్నీ వదిలి బాధ్యత తలకెత్తుకునేంత (చిన్నదా పెద్దదా అన్నది వేరే విషయం) ధైర్యం మాత్రం ఉంది, అంతకంటే మరో మార్గం లేని పరిస్థితి ఎదురయింది..

తండ్రి నెలకొల్పిన వ్యాపారాన్ని మరొకరికి ధారాదత్తం చెయ్యలేక ఆమె ఎదురు నిలబడింది.. ఆప్రయత్నంలో ఆమెకు తోడు గా నిలిచారు, రాజేంద్ర తో పాటు తమ జీవితాన్ని మొదలు పెట్టిన ఆర్థిక లావాదేవీలు చూసే అక్కవుంటెంట్ సుగుణ, ' మాస్టర్ గా పిలవబడే చీఫ్ టైలర్ గోపాల్..

వారిద్దరి సహాయంతో ఆమె రెండేళ్ళలో అన్ని విషయాలని ఒక కొలిక్కి తెచ్చింది..

పంతొమ్మిది నిండి ఇరవై ఏళ్ళ వయసు వచ్చేసరికి అనేక విషయాల మీద పట్టు సాధించింది. వారిద్దరి సహాయంతో ఎందరినో కలిసింది, ఎన్నో రకాల విధానాలని అమలుపరిచింది, కొన్ని దెబ్బ తిన్నా మరి కొన్ని ఆమెని నిలబెట్టాయి..

ఎక్కడ నమ్మాలో, ఎక్కడ నమ్మినట్టుగా కనిపించాలో తెలుసుకుంది. ఎక్కడ పెట్టాలో, ఎక్కడ తియ్యాలో నేర్చుకుంది.. ఇలాంటివాటిల్లో సుగుణ ఆమెకి అండగా నిలిస్తే..

గోపాల్ తో కలిసి కొత్త డిజైన్లు ఎలా ఉన్నాయో, తాము మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఎలా మారాలో, లాంటివి తెలుసుకుంది.

పార్వతి బ్రతుకు మళ్ళీ గాటిన పడింది.

పాతికేళ్ళ సుధీరకి పెళ్ళి చెయ్యడం లేదనీ, ఆమె వ్యాపార దక్షత వల్లే బ్రతుకుతోందని బంధువుల్లోనూ, తెలిసిన వాళ్ళలోనూ అనుకోవడం మొదలయింది..

కూతురు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే, ఇంతదాకా వచ్చినది సుధీర లేకపోతే ఏమవుతుంది? అన్న భయం ఆమెలో లేకపోలేదు, అలా అని కూతురిని ఎల్లకాలం ఇంట్లో ఉంచుకోలేదని తెలుసు.. కానీ మార్గాంతరమే తోచడం లేదు ఆమెకి.

" కావలసిన వాడిని చూసి కూతురికిచ్చి చేస్తే ఇద్దరూ ఇంట్లోనే ఉంటారు కదా" అన్న ఆలోచన చెప్పిందావిడకి పిన్ని వరసయ్యే ఆవిడ.. తన కొడుకు రెడీ అంది కూడా..

ఆమాట సుధీరతో చెప్తే ఆమె చిరునవ్వు నవ్వింది..

" నన్నూ, మన వ్యాపారాన్ని చూసుకునేవాడిని నేను ఇప్పటికే ఎంచుకునాను అన్నట్టుగా".

ఆమె ఎంపిక విన్న పార్వతి కోపంతో ఊగిపోయింది..

"పోయి, పోయి ఆ టైలర్ ని చేసుకుంటావా? ఇదా నీ ఎంపిక?" అంటూ కోప్పడింది.

"నాకండగా నిలిచాడు ఇన్నేళ్ళు, చిన్న వయసునించే నాన్నతో కలిసి నడిచాడు. ఒక వ్యక్తిగా నాకతను నచ్చాడు ఇందులో తప్పేముంది?" అంది సుధీర సౌమ్యంగా..

"తప్పు, తప్పున్నరా? వాడి తాహతేమిటి? మన అంతస్థేమిటి?" అంది పార్వతి.

"అతని సహాయంతోనే మనకీ అంతస్థొచ్చింది" అంది సుధీర.

" వాడికి చదువు, సంధ్యా ఏమీ లేవు తెలీదా?" పార్వతి హుంకరించింది.

" చదువుమానేసి బిజినెస్ మొదలుపెట్టిన నాకన్నా ఎవరికెక్కువ తెలుసమ్మా?" అంది సుధీర.

" వాడికి అమ్మా, నాన్నా లేరు.. ఎక్కడివాడో తెలీదు.. ఏమైనా నేనొప్పుకోనూను" అంది పార్వతి కోపంగా.

"నిన్ను అమ్మా అని పిలుస్తాడు, నువ్వు నిన్నటివరకూ సుగుణ తోనూ, అతనితోనూ కూడా అదే చెప్పేదానివి.. బిడ్డల్లా నిలిచారు మీరిద్దరూ అని.. మన ఇంటికొస్తే మనమే అతనికి అన్నీ అవుతాం" అంది సుధీర.

మూడు రోజులు కూతురితో మాట్లాడ్లేదు పార్వతి.

తల్లి ఆవేశంలో ఉందని, అది తగ్గి ఆలోచిస్తుందని అనుకుంది సుధీర.

పంతొమ్మిదేళ్ళ తమ్ముళ్ళిద్దరూ ఇంట్లో జరుగుతున్నది గమనిస్తున్నారు. వారిద్దరికీ అక్క అంటే తగని ప్రేమ..గౌరవం..

నాలుగో రోజున ముగ్గురు పిల్లలనీ పిలిచి చెప్పింది పార్వతి తన నిర్ణయం.

చావనైనా చస్తాను కానీ సుధీర నిర్ణయాన్ని, ఈ వివాహాన్నీ ఒప్పుకునే ప్రసక్తే లేదని, కాదూ కూడదంటే సుధీర తన దారి తాను చూసుకోవచ్చని.. ఆమెకి రావలసినది రాసి ఇచ్చేస్తాను తప్ప ఆ గోపాల్ ని అల్లుడిగా ఒప్పుకునే సమస్యే లేదని తెగేసి చెప్పింది..

"అమ్మా, నాకోసం కాకపోయినా చదువుకుంటున్న వాళ్ళ కోసమైనా ఆలోచించు.. మరో రెండు మూడేళ్ళలో వాళ్ళు పెద్దవాళ్ళవౌతారు.. పోస్ట్ గ్రాడ్యుయేట్ లు అవుతారు. అప్పుడు ఒకరు ఉద్యోగం చూసుకున్నా మరొకరు వ్యాపారం చూసుకోగలుగుతారు కదా!" అంది సుధీర..

" అక్కరలేదు, నువ్వేమీ మాకు నీ సాయం ధర్మంగా చెయ్యక్కరలేదు. నీలో ఉన్న రక్తమే వాళ్ళ లోనూ ఉంది, నువ్వు పదిహేడేళ్ళకి చేసిన పని వాళ్ళు పంతొమ్మిదేళ్ళకు నీకన్నా బాగా చెయ్యగలరు. ఇంక నువ్వు నీ దారి చూసుకోవచ్చు" అంది.

అలా సుధీర...

అలా దూరమైన సుధీరని మళ్ళీ ఆమె ఎప్పుడూ కలవలేదు, తలచ లేదు.. ఎన్నో సార్లు కొడుకులు చెప్పి విసిగిపోయారు.. కొడళ్ళు కూడా చెప్పడానికి ప్రయత్నించారు. కానీ ఆవిడ మంకుపట్టు ముందు గెలవలేకపోయారు. పట్టూ విడుపూ ఉండాలని తెలియని తల్లిని ఏమీ అనలేక మిన్నకుండి పోయారు.

" అమ్మా! భోజనానికి రావూ!" సుజయ్ పిలుస్తుంటే ఈ లోకంలోకి వచ్చింది పార్వతి..

"పద వస్తున్నా" అంది.

"ఎప్పటిలా, నాకాకలిగా లేదు, ఎప్పుడు తినాలో నాకు తెలుసు!" అంటూ పెళుసుగా మాట్లాడని తల్లిని చూసి ఊపిరి పీల్చుకున్నాడు సుజయ్.

మరో ఐదు నిమిషాలకి చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని, చీర మార్చుకుని కిందకి వచ్చింది ఆమె.

అప్పటికే కొడుకులిద్దరూ, కోడళ్ళు టేబిల్ దగ్గర కూర్చున్నారు.. ఐదుగురూ భోజనానికుపక్రమించారు.

" అమ్మా, అక్క ఏం చేసిందని నీకు కోపం? ఎంతకాలం?" అన్నాడు అజయ్ నెమ్మదిగా.

" నువ్వు కూడానా?" అన్నట్టు చూసింది కొడుకువైపు.

" చెప్పమ్మా, పదేళ్ళవుతోంది దాదాపుగా  ఇప్పటికే..మర్చిపోలేనంత తప్పేమీ తను చెయ్యలేదే? నచ్చిన వాడిని చేసుకోవడం తప్పా?" సుజయ్ అన్నాడు.. " నిజానికి తనని వదులుకుని మనమే పెద్ద తప్పు చేశాం" అన్నాడు.

" మనం అని మిమ్మల్ని కలుపుకోనక్కరలేదు. అమ్మా నీదే తప్పు అనండి, నాకేమీ పరవాలేదు.అది లేక నాకొచ్చిన లోటేమీ లేదు, నాకొడుకులిద్దరూ మంచి వ్యాపారస్థులుగా పేరు తెచ్చుకుంటున్నారు, కోడళ్ళు కూడా మీకు తోడుగా ఆన్ లైన్ వ్యాపారం, బొటీక్ పెట్టుకుని మీకు తోడుగా ఉన్నారు." అంది పార్వతి విసురుగా.

" మాకుంది"  కోడళ్ళిద్దరూ అన్నారు.

" ఏమిటి?" అంది పార్వతి కోపంగా.

" అవునత్తా. వదిన మా దగ్గర లేరన్న బాధ మాకుంది. మననెన్నో విధాలుగా ఆదుకున్న ఆవిడ మన దగ్గరగా, మనతోటే ఉంటే బావుంటుందన్న భావన మాకుంది.." అంది పెద్ద కోడలు రీనా.

"ఇప్పుడు కొత్తగా వచ్చినది కాదు, ఎప్పటినించో ఉన్నదే అది"

" ఎందుకు? అది తెచ్చిన తలవంపులు చాలకనా? నీ కూతురు మీ వర్క్ షాప్ టైలర్ ని పెళ్ళి చేసుకుందిట కదా?" అన్న బంధువుల మాటలిప్పటికీ నాకు వినిపిస్తూనే ఉంటాయి తెలుసా?" అంది పార్వతి తన కోపాన్ని పప్పు గరిటె మీద చూపిస్తూ.

" అలా అన్నవాళ్ళెవరూ మావయ్యగారు పోయినప్పుడు వెంట నిలవలేదే?" అన్న ఆలోచన మీకెప్పుడూ రాలేదా? చిన్న కోడలు అంజన అడిగింది నెమ్మదిగా..

సూటిగా చూసిందామె వైపు.

"అవునత్తా, మీ అమ్మాయి ఇంటినించి వెళ్ళిపోయాకా కూడా మీ పిల్లలిద్దరూ ఎంబియేలు చదువుకున్నారు వ్యాపారం కూడా చూసుకున్నారు కదా! ఎలా సాధ్యం?"

"నాకొడుకులు తెలివైనవాళ్ళు. రెండూ సమర్ధించుకున్నారు!"  అంది పార్వతి

"అలాగా? కానీ ఇంటర్ మీడియెట్ మధ్యలో ఆపేసి వ్యాపారాన్ని అందిపుచ్చుకున్న వదిన పాత్రేమైనా ఉందా?  అని మిమ్మల్నెవరూ అడగలేదా?" అంది రీనా.

"ఎప్పుడూ అక్క వెంట వెళ్ళి ఏదీ పట్టి చూడని వాళ్ళు వ్యాపారం మీద ఇంత పట్టుని ఎలా సాధించారు? అని మీకెప్పుడు అనిపించలేదా? ఎవరూ అడగలేదా?"

"వచ్చీరాని పనులతో మేమిద్దరూ ఒకరితో ఒకరు కొట్టుకుంటూ ఒకే సారి ఆన్ లైన్ వ్యాపారాలు చేద్దామనుకుంటూ, మాటలు మానేసుకున్న స్థితి నించి ఇద్దరం కలిసి రెండూ చూసుకుందాం. అన్న మార్గానికి ఎలా వచ్చాం? అని మిమ్మల్ని ఎవరూ అడగలేదా? కొడుకుల పోరు పడలేక మీరు ఆవిడని మా పెళ్ళిళ్ళకి పిలవనిచ్చారు తప్ప ఆవిడ వస్తే ప్రేమగా పలకరించలేదేం? పెద్దదానివి ఇంకా ఎంత కాలం ఈ పంతం? అని మిమ్మల్నెవరూ అడగలేదా? మీకెవరూ చెప్పలేదా?"

కోడళ్ళిద్దరూ వరసగా అడుగుతున్న ప్రశ్నలకామె దగ్గర సమాధానాలు లేవు.

మెల్ల మెల్లగా అర్ధం అవుతోంది ఆమెకి.

పగ్గాలు తన చేత ఉంచుకుని తమ్ముళ్ళని పరుగ్గుర్రాలని చేసింది తన కూతురని, ఆమె వెన్నంటి ఉన్నదామె భర్త అని తెలియడానికి ఆ సమయం చాలామెకి.

అప్పుడు చెప్పాడు సుజయ్.

" అసలు విషయం విను.

గోపాల్ బావ చెప్పినది..

" అమ్మకి కోపం వస్తే అది ఆవిడ హక్కు అనుకోవాలి ధీర. కానీ ఏమీ తెలియని వీళ్ళిద్దరిని మనం వదిలేస్తే అది నాన్న క్షమిస్తారా? ఏదో ఆశించి చేసేది సహాయం కాదు, కానీ మనం ఆశించే చేద్దాం.. వీళ్ళిద్దరి క్షేమం, అభివృద్ధి. వివిధపరిస్థితుల వల్ల చదువుని మధ్యలో ఆపేసిన మనిద్దరికంటే దాని విలువ ఎవరికెక్కువ తెలుస్తుంది? వీళ్ళిద్దరికీ ఆ పరిస్థితి ఎందుకు రావాలి?

కనీసం ఒక స్థాయికి వచ్చేవరకూ అమ్మ అన్న విషయాలు నువ్వు పట్టించుకోనక్కరలేదు.. మనం ఏర్పరుచుకున్న నెట్ వర్క్, సంబంధాలతో మనం కొత్తగా వ్యాపారం ప్రారంభించినా నాలుగైదేళ్ళల్లో ఒక స్థాయికి తప్పక చేరుతాం, కానీ వీళ్ళ పరిస్థితి ఏమిటి? మనం విడిపోయామని బయట తెలియవలసిన అవసరం ఏమిటి? విభజించి పాలించు అన్న అడ్వాంటేజ్ ఇతరులకి ఇవ్వడం తప్పు.

నీ ఆత్మాభిమానాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ కుటుంబం కంటే అది గొప్పదని నేను అనుకోను, ఎందుకంటే ఎద్దైనా లేనివారికే దాని విలువ బాగా తెలుస్తుంది. ఇవన్నీ అమ్మకి చెప్పి ఆమెని బాధ పెట్టక్కరలేదు, ఆమెకిష్టం లేని పని చెయ్యడం మన అభిమతం కాదు, వీళ్ళిద్దరినీ ఎదిగేలా చెయ్యడమే మనకి కావలసినది.

మనుషులు దూరంగా ఉన్నంత మాత్రాన మనసులు దూరమవ్వక్కరలేదు. మనకి వీళ్ళెప్పుడూ చిన్నపిల్లలే, ఇప్పుడు వాళ్ళ చెయ్యి పట్టి నడిపించవలసిన బాధ్యత మనదే."

ఇంతేనమ్మా బావ చెప్పినది.

అప్పటినించే దూరాన ఉంటూనే నడిపింది మన వ్యాపారాన్ని. నడిపించింది మమ్మల్నిద్దరినీ.. నీ కోడళ్ళు చెప్పింది విన్నావుగా." అజయ్ అన్నాడు పూర్తి చేస్తూ..

"వచ్చే శుక్రవారం అక్కకి ఉత్తమ వ్యాపారవేత్తలకిచ్చే ప్రముఖ అవార్డ్ ఇస్తున్నారు. మేమందరం వెళ్ళి వాళ్ళనిద్దరినీ అటునించి ఇటు తీసుకురావాలని అనుకున్నాం. నీకు అంగీకారమే అని అనుకుంటున్నాం.. అక్క కావాలి, మనందరికీ కావాలి.." అంటూ లేచాడు సుజయ్ చెయ్యి కడుక్కోవడానికి.

పార్వతి మౌనంగా ఉండిపోయింది. ఆమె మనసులో ఏముందో అని ఆత్రుతగా చూస్తున్నారు మిగతా ముగ్గురు.

●●●

Click here to share your comments on this story